బాలల
ఫిబ్రవరి 2017

# చంద్రప్రభ


మాసపత్రిక

రూ. 20/-



శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి

అద్భుత సీరియల్ **స్వర్ణసింహాసనం**



# స్వశక్తి

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

వశిష్ఠ గురుకులంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన పదిమంది విద్యార్థులకు ఆ రోజు గురుకులంలో ఆఖరి రోజు అందుకని మహర్షి వశిష్ఠుడు వారినుద్దేశించి, "ఇన్ని సంవత్సరాలుగా నా దగ్గర మీరు ఎన్నో విద్యలు నేర్చుకుని పరిపూర్ణులయ్యారు. ఇహ మీరు సమాజంలో చక్కగా బతకగలరు. మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను. వెళ్ళిరండి" అని "అన్నట్టు ఈ గురుకులంలో నాదగ్గర విద్య నభ్యసించే వాళ్ళకి నేను ఒక ఉపకారం చేస్తాను అదేమిటంటే ఇక్కడికి తూర్పువైపుగా పాతిక క్రోసుల దూరం వెళితే అక్కడ వివేకపురం అనే ఊరుంటుంది. ఆ ఊరికి ఆనుకుని ఒక అడవి వుంది. అందులో ఊడలతో విస్తరించుకుని వున్న మఱ్ఱి చెట్టు తొర్రలో కొన్ని వజ్రాలు ఉన్నాయి. మీరు అందరూ అక్కడికి వెళ్ళి అవి తీసుకుని వ్యాపారమే చేస్తారో, మరే విధంగా ఖర్చుపెట్టుకుంటారో మీ ఇష్టం. కాని మీరందరూ అక్కడికి వెళ్ళాలి. ఇది మీ గురువుగా నేను మీకు ఇస్తున్న

కానుక" అన్నాడు నవ్వుతూ

వాళ్ళందరిలో రవివర్మకు అక్కడికి వెళ్ళాలని లేదు కాని గురువుగారు చెప్పారు. కాబట్టి వాళ్ళతో బయలు దేరాడు. అందరూ వివేకపురం చేరుకుని, అక్కడ్నుంచి ఆనందంగా పరుగు పెడుతూ అడవివైపు వెళ్ళారు. రవివర్మ మాత్రం ఆ ఊళ్ళోని పెద్ద మనిషిని కలిసి "అయ్యా మీ ఊరికి ఆనుకుని వున్న అడవిలోని మఱ్ఱిచెట్టు తొర్రలో వజ్రాలున్నాయని తెలుసా?" అని అడిగాడు.

దానికి ఆ పెద్దమనిషి నవ్వి తెలుసు కాని మాకు అప్పనంగా వచ్చే వజ్రవైఢూర్యాలు అక్కర్లేదు. మేము మా స్వశక్తిని నమ్ముకున్నాం. హాయిగావున్నాం" అన్నాడు.

వెంటనే రవివర్మ వెనక్కి బయలుదేరి గురుకులం చేరుకుని వశిష్ఠుడితో "అయ్యా వాళ్ళతో నాకు వెళ్లాలని లేకపోయినా మీ మాట కాదనలేక వెళ్ళాను. అక్కడి ఊరిలోని పెద్దమనిషిని కలిసి వజ్రం విషయం అడిగితే, మేము స్వశక్తిని నమ్ము కున్నాము అందుకే హాయిగా వున్నాం అన్నాడు. నా స్వశక్తి మీద నాకు నమ్మకం మీ దగ్గర చేసిన విద్యాభ్యాసం వల్ల కలిగింది. అందుచేత నన్ను అక్కడికి వెళ్ళనందుకు క్షమించి, దీవించి పంపండి ఏదైనా కొలువు సంపాదించుకుంటాను." అన్నాడు వినయంగా.

రవివర్మా! నువ్వయ్యా నా నిజమైన శిష్యుడివి. ఇంత చదివినా అవివేకులై వజ్రాల వేటకు బయలు దేరారు. వారలా పిచ్చి పట్టినట్టు అడవంతా వెతికి వేసారి ఇళ్ళకెళ్ళి పోయారు. నువ్వు నేను పెట్టిన పరీక్షలో నెగ్గావు. మంచి విద్యార్థిని తనకు సలహాదారుని చేయమని మాహారాజు నన్ను కోరాడు. ఇదిగో ఈ ఉత్తరం వారికివ్వు. రాజస్థానంలో కొలువు దొరుకుతుంది. ఇలాగే వినయ విధేయతలతో పైకిరా నాయనా'' అని దీవించి పంపించాడు.